ప్రజాశక్తి

శుక్రవారం 2 డిసెంబర్ 2022

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

విశాఖకు గ్లోబల్ ఇన్వెస్టర్లు!

వైజాగ్ టెక్ సమ్మిట్-2023కు వేదిక కానున్న నగరం

పెట్టుబడులపై భారీ అంచనాల్లో రాష్ట్ర ప్రభుత్వం, ఐటి నిపుణులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులకు కొదవేమీ లేదు. గత ప్రభుత్వ హయాంలో మూకుమ్మడిగా పలు ప్రపంచ స్థాయి సదస్సులు విశాఖ కేంద్రంగా నడిచిన సంగతి తెలిసిందే. అయితే అవి సాధించిన ఫలితాలు చూస్తే 'ఆ మూడు రోజుల హడావుడి, హంగామా మినహాయిస్తే విశాఖకు గానీ, ఆంధ్రప్రదేశ్‌కు గానీ ఒరిగిందేమీ లేదని స్పష్టంగా చెప్పొచ్చు. అదే స్థాయిలో, భారీ పెట్టుబడుల అంచనాలతో వైసిపి ప్రభుత్వం కూడా గ్లోబల్ ఇన్వెస్టర్ల కలయిక కోసం కసరత్తు చేసినట్లు స్పష్టమవుతోంది. నిజంగా పెట్టుబడులు-పరిశ్రమలు వస్తే... బాగా జరిగితే మంచిదే... కానీ అస్సలు ఇలాంటి సదస్సులు నిర్వహించడం ద్వారా ఏదో జరిగిపోతుందన్న ఆశలు ఈ ప్రాంతంలో కలిగిస్తేనే సమస్య. ఇంతవరకూ అదే జరిగింది. వైజాగ్ టెక్ సమ్మిట్-2023 పేర ఫిబ్రవరి 16, 17 తేదీల్లో పలువురు సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ల ప్రసంగాలు, ఇన్వెస్ట్‌మెంట్ లాబీయింగ్‌లపైనా సదస్సు నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. విశాఖ కేంద్రంగా పనిచేస్తున్న ఐటి సంస్థ పల్సస్ గ్రూప్ సిఇఒ గేదెల శ్రీనుబాబు ఈ బాధ్యతలను స్వీకరించినట్లు తెలుస్తోంది. ఈయన వేల కొద్దీ అంతర్జాతీయ సదస్సులను నిర్వహించిన అనుభవంతో వైజాగ్ టెక్ సమ్మిట్ బాధ్యతలను ఈయనకు ప్రభుత్వం అప్పగించింది.



గత ఎన్నికల్లో వైసిపి తరపున శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యునిగా టికెట్‌ను తొలుత ఈయనకు కేటాయించి తర్వాత చివరనిమిషంలో వైసిపి వెనక్కి తీసుకున్న సంగతి తెలిసిందే. పల్సెస్ శ్రీనుబాబుగా గుర్తింపు తెచ్చుకున్న ఇతనిపై 'గ్లోబల్ సమ్మిట్' బాధ్యతలు ఉంచినట్లు స్పష్టమవుతోంది.

రెండు రోజుల సదస్సుల్లో కీలకాంశాలు...

దేశ, విదేశాల నుంచి కంపెనీలు, ప్రముఖ వ్యాపారులు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లు విశాఖలో జరగనున్న 2023 ఫిబ్రవరి 16, 17 తేదీల 'వైజాగ్ టెక్ సమ్మిట్'కు హాజరుకానున్నారు. సుమారు 1000 మందికి పైగానే ఈ సదస్సుల్లో ప్రతినిధులు ఉంటారని తెలుస్తోంది. టెక్ కంపెనీల కార్యకలాపాలకు విశాఖ వేదిక అయ్యే అన్ని అర్హతలున్నా ఇంతవరకూ ఆ దిశగా సదస్సులు జరగలేదు. అత్యాధునిక టెక్నాలజీని ఈ సదస్సుల్లో పరిచయం చేసే అవకాశాలు కనిపిస్తోంది. ప్రపంచంలో చైనా, అమెరికా పలు రంగాల్లో సాంకేతికతతో ముందుకు సాగుతున్నారు. 145 కోట్ల జనాభా కలిగిన చైనా పేదరికాన్ని జయించింది. 130 కోట్లున్న భారతదేశం (చైనా కంటే ముందు స్వాతంత్ర్యం పొందినప్పటికీ) ప్రపంచ ఆహార ఆకలి సూచీలో 107 స్థానంలో ఉంది. ప్రపంచ స్థాయి సంస్థలను

మిగతా 2లో..

నిరుద్యోగం-పరిష్కార మార్గాలపై 3న రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : నిరుద్యోగ సమస్యపై రాష్ట్ర స్థాయి సదస్సును ఈ నెల 3న అల్లూరి సీతారామరాజు విజ్ఞానకేంద్రంలో నిర్వహించనున్నట్లు సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి బి.జగన్ తెలిపారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఐటియు రాష్ట్ర, జిల్లా మహాసభలు సందర్భంగా నండూరి ప్రసాదరావు స్మారక సెమినార్లు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విశాఖలో నిర్వహించే సదస్సుకు ముఖ్య వక్తలుగా ప్రొఫెసర్ పురేంద్ర ప్రసాద్ (హైదరాబాద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగన్ తదితరులు

సెంట్రల్ యూనివర్శిటీ), సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్. నర్సింగరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సుకు యువకులు, విద్యార్థులు

మిగతా 2లో..

అమెరికా విద్యకు 9 మంది గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల విద్యార్థులు తొమ్మిది మందికి ఏడాది పాటు అమెరికాలో చదువుకునే అవకాశం లభించిందని విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపావతి తెలిపారు. 2023-24లో కెనెడి లూగర్ యూత్ ఎక్చేంజ్ స్టడీ ప్రోగ్రాం కింద టి.గౌతమి, బి.గంగాప్రతిభ (మేఘాద్రిగెడ్డ), రోడా ఎవెంజెలిన్ (సిఇఇ గురుకులం), ఎస్.జ్ఞానేశ్వర్(శ్రీకృష్ణాపురం), ఎస్.లావణ్య (కొక్కిరాపల్లి), ఎస్.అశ్రిత (నక్కపల్లి గురుకులం) నుంచి అక్టోబర్ 11న హైదరాబాద్‌లోని బేగంపేట బాలికల కళాశాలలో జరిగిన డిస్కవరీ రౌండ్ నాలుగో దశలో ఎంపికయ్యారు. అమెరికాలో విద్యకు అర్హత సాధించిన విద్యార్థులను సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మెరుగు నాగార్జున, ఎపి సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి రంగా పావనమూర్తి, అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎన్.సంజీవరావు అభినందించారు.

అనుమానాస్పద స్థితితో వార్డెన్ దంపతుల మృతి

▶ వార్త మెయిన్ 3లో..

నేడు ఐఎన్ఎస్ అస్త్రధారిణి అప్పగింత

▶ వార్త మెయిన్ 3లో..

ఒడిశా రోడ్డు ప్రమాదంలో నలుగురు విశాఖ వాసుల మృతి

▶ వార్త మెయిన్‌లో..

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సంక్షేమానికి కలెక్టర్ విరాళం



డిఎల్ఒకు చెక్కును అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సంక్షేమానికి తన వంతు విరాళంగా ఒక నెల జీతం రూ.1.10 లక్షల చెక్కును డిఎల్ఒ డాక్టర్ పూర్ణేంద్రబాబుకు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం అందజేశారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులతో అల్పాహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులతో కలిసి కలెక్టర్ అల్పాహారం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సంక్షేమానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిఎల్ఒ కన్వీనర్‌గా ఎయిడ్స్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎయిడ్స్‌పై ప్రజలలో అవగాహన పెంచాలని, అసమానతలను అంతం చేయడానికి అందరూ ఏకమవ్వాలని, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎయిడ్స్ సోకిన వారిని అందరితో సమానంగా చూడాలని, కొత్తగా ఏ ఒక్కరూ కూడా హెచ్ఐవి భారిన పడకుండా అవగాహన కలిగించాలన్నారు. రక్తపరీక్షలు, రక్తమార్పిడి చేసే సమయంలో వైద్యులు తగు జాగ్రత్తలు తీసుకొని ఎయిడ్స్ వ్యాప్తి కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వైద్య సంచాలకులు డాక్టర్ ఎం.ఉమాసుందరి, జిల్లా ప్రోగామ్ అధికారులు డాక్టర్ ఎన్.జీవనరాణి, డాక్టర్ ఎం.రమారెడ్డి, వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జగ్గునాయుడు

మున్సిపల్ వర్కర్స్ జిల్లా మహాసభల ముగింపులో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లూరి విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా 10వ మహాసభలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి వైసిపి ప్రభుత్వం మోసగించిందన్నారు. పైగా ఆప్కాస్ పెట్టి కార్మికులకు శాశ్వత ఉద్యోగాలు రాకుండా కుట్రపన్నిందని విమర్శించారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్సు, జీతాలు బకాయిలు పెట్టి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. జివిఎంసి పాలకవర్గం ప్రజలపై పన్నులు భారీగా వేసి, ముక్కుపిండి వసూలు చేస్తోందని, కార్మికుల సంక్షేమం, నగర అభివృద్ధి మాత్రం విస్మరిస్తోందని విమర్శించారు. పనిముట్లు నుంచి పలు వస్తువులను కార్మికుల డబ్బులతో కొనిపిస్తుందని పేర్కొన్నారు. సమస్యలపై కార్మికులు చేసే పోరాటాల్లో సిఐటియు అండగా ఉంటుందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాసే విధానాలు అవలంభిస్తున్నాయని, వీటిని ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, జి.సుబ్బారావు మాట్లాడుతూ, ఆప్కాస్ నుంచి మున్సిపల్ కార్మికులను తప్పించి పర్మినెంట్ చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. సమానవేతనం రూ.28వేలు, పర్మినెంట్‌కోసం సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలు అనంతపురంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో

మిగతా 2లో..

కేంద్రం ఇచ్చింది రూ.5వేల కోట్లే...

మొదటి పేజీ తరువాయి..

విశాఖకు గ్లోబల్ ఇన్వెస్టర్లు!

ఒకే వేదికపైకి తీసుకొచ్చే సమ్మిట్‌లు చాలానే జరిగినా ఈ 2023 సదస్సుకు అనేక ప్రత్యేకతలున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం విశాఖలో వైజాగ్ టెక్ సమ్మిట్ -2023 ఈవెంట్ పోస్టర్‌ను ఇండో-అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపి ప్రభుత్వ ప్రతినిధి బృందం తరపున ఎపిటా గ్రూప్ సిఇఒ సలికిరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, పల్సస్ గ్రూప్ సిఇఒ గేదెల శ్రీనుబాబు, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, ఏపి, తెలంగాణ నుంచి పలువురు జిఎంఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్స లిమిటెడ్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.

విశాఖకు ఏం కావాలి?

'విశాఖ సిటీ ఆఫ్ డెస్టినీ' అంటే పారిశ్రామిక, ఆర్థిక, పర్యాటక వ్యవహారాలకు 'గమ్యస్థానం'గా ఉందన్నది ప్రముఖులు భావిస్తున్న విషయం. కీలక ప్రాజెక్టులతోనే విశాఖ అభివృద్ధికి బాటలు వేయొచ్చన్న ప్రతిపాదనలు ఏనాటినుంచో పెండింగ్‌లో ఉన్నాయి. పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా మెట్రో రైల్ డిమాండ్ ఉంది. ప్రణాళికలు కూడా సిద్ధంగా ఉన్నాయి. కానీ తీవ్ర తాత్సారం జరుగుతోంది. వాల్తేరు రైల్వే డివిజన్‌ను కేంద్రంలోని బిజెపి ఎత్తేసి తీవ్ర అన్యాయం చేసింది. విశాఖ కేంద్రంగా కొత్త రైల్వేజోన్‌పైనా మీనమేషాలు లెక్కించడమే గాకుండా విశాఖకు విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మాట మాత్రమైనా చెప్పకుండా ఢిల్లీ వెళ్లిపోయారు. అన్నిటికంటే నలుగుతోన్న సమస్యగా 'వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం ఈ ప్రాంతాన్ని తీవ్ర కలతకు గురిచేస్తోంది. విశాఖ భవిష్యత్తు అంటే వైజాగ్ స్టీల్‌ప్లాంట్.. అలాంటి పరిశ్రమను అమ్మేయాలని కేంద్ర సర్కారు కుట్రపన్నడం, పై ప్రాజెక్టులపై తీవ్రనిర్లక్ష్యాన్ని చూపడంతో ఎన్ని ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్‌లు వస్తే మాత్రం 'విశాఖ సర్వతోముఖాభివృద్ధి'కి దోహదపడగలవు? అన్న ప్రశ్న మేధావులు, ప్రజాసంఘాల నుంచి వినిపిస్తోంది. నిజంగానే ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులు, టెక్ సమ్మిట్‌లు ఐటి పురోభివృద్ధికి తోడ్పడితే, ఆచరణలో యువతకు ఉపాధి బాటలు వేస్తే సమ్మిట్‌లతో లాభముంటుంది.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉన్నాయని, అందులో భవిష్యత్తు పోరాటాలకు దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రిన్సిపల్ ఆఫీస్ బేరర్స్ పి.వెంకటరెడ్డి, జి.సుబ్బారావు గౌరవాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అధ్యక్షునిగా టి.నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.రత్నం, ప్రధాన కార్యదర్శిగా ఉరుకూటి రాజు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎంవి.ప్రసాదరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.కృష్ణారావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా గొలగాని అప్పారావు, కోశాధికారిగా ఎం.సూరీడు, మరో 39 మంది కార్యదర్శులు, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

నిరుద్యోగం-పరిష్కార మార్గాలపై 3న రాష్ట్ర సదస్సు

నిరుద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.భారతదేశానికి కీలకంగా వున్న యువతలో నిరుద్యోగం ఎలా ఉంది. దాని పరిష్కారానికి ప్రభుత్వం ఎటువంటి విధానాలు రూపొందించాలో సూచనలు చేయడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'నిరుద్యోగం-ప్రభుత్వ విధానాలు-కర్తవ్యం'పై సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. మీడియా సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, అధ్యక్షులు బి.కుసుమ, కె.రాఘవేంద్ర పాల్గొన్నారు.

గొరిల్లా గ్లాస్ విక్టస్-2తో మెరుగైన రక్షణ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : నూతన గొరిల్లా గ్లాస్ కార్నింగ్ 'గొరిల్లా గ్లాస్ విక్టస్- 2 ఎంతో దఢమైనదని, కాంక్రీట్ వంటి గట్టి స్థలంపై పడినప్పటికీ నష్టం కలగకుండా మెరుగైన రక్షణ అందిస్తుందని కార్నింగ్ గొరిల్లా గ్లాస్ వైస్ ప్రెసిడెంట్, హజనరల్ మేనేజర్ డేవిడ్ వేలాస్క్వెజ్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్నింగ్ కంపెనీ కార్నింగ్ గొరిల్లా గ్లాస్ పోర్ట్ ఫోలియోను విస్తరించడంలో భాగంగా గొరిల్లా గ్లాస్ విక్టస్- 2 ను ఆవిష్కరించినట్లు తెలిపారు. స్మార్ట్ ఫోన్లు డిజిటల్ జీవితానికి కేంద్రంగా ఉన్నాయన్నారు. స్పష్టమైన డ్యామేజీ ఫ్రీ డిస్‌ప్లేపై ఆధారపడటం పెరుగుతుండడంతో, అసాధారణమైన స్క్రాచ్ డ్రాప్ రెసిస్టెన్స్ అవసరం పెరిగిందని తెలిపారు. భారత్ చైనా వంటి దేశాలలో అతిపెద్ద స్మార్ట్ ఫోన్ మార్కెట్లో 84 శాతం మంది వినియోగదారులు తమ కొనుగోలులో ముందు ఉన్నారని చెప్పారు.

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రభుత్వ రంగంలో ఏర్పాటైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది కేవలం రూ.5 వేల కోట్లు మాత్రమేనని, అయితే స్టీల్‌ప్లాంట్ వివిధ పనుల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి సుమారు రూ.50 వేల కోట్లు చెల్లించిందని సిఐటియు జాతీయ అధ్యక్షులు ఎస్.కనకారావు తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 609వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు గృహ కార్మిక మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఛాలెంజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ దీక్షల్లో యూనియన్ జాతీయ కార్యదర్శి జి.బాలభాను, పి.వెంకటలక్ష్మి, ఎండా ఎర్రమ్మ, కొమర హైమ, మైలపల్లి మోహిని, ఎం.సత్యవతి, అంబటి అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న కార్మికులు

జివిఎంసి కమిషనర్‌ను కలిసిన 'మున్సిపల్' నాయకులు

కమిషనర్‌తో మాట్లాడుతున్న సుబ్బారావు తదితరులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసి కమిషనర్ రాజాబాబు, అడిషనల్ కమిషనర్ సన్యాసిరావులను జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నూతన కార్యవర్గం గురువారం సాయంత్రం గౌరవ సూచకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు జి.సుబ్బారావు, అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రత్న, వైస్ ప్రెసిడెంట్ ఎస్.రమణ, జాయింట్ సెక్రెటరీ జె.నాయుడు, ఉపాధ్యక్షులు పి.అప్పలరాజు, జి.రాము, సహాయ కార్యదర్శి ఎస్.గణేష్, ఇ.ఆదినారాయణ (వైస్ ప్రెసిడెంట్) ఉన్నారు.

నేటి నుంచి ఇగ్నో వార్షిక పరీక్షలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) వార్షిక పరీక్షలు ఈ నెల 2వ తేదీ నుంచి జరిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో 5 జిల్లాల్లో 7 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 4000 మంది విద్యార్థులు పరీక్షలు రాయటానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. హాల్ టికెట్లు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరీక్షకు హాజరయ్యేవారు హాల్‌టికెట్‌తో పాటు ఇగ్నో గుర్తింపు కార్డుతో రావాలని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్స్ వంటి సాంకేతిక ఉపకరణాలు పరీక్షా కేంద్రాలలోకి అనుమతించబడవని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంవిపి కాలనీలో ఉన్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని పరీక్షా కేంద్రాలను ముందుగానే సంప్రదించాలని సూచించారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం : మేయర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ : ఏ వృత్తిలో ఉన్నా, మానసిక ఉల్లాసానికి క్రీడల ఎంతో అవసరమని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. విశాఖ రైల్వే గ్రూప్‌లో డాక్టర్ టిడిఆర్ రెడ్డి సారథ్యంలో ప్రైమరీ క్రికెట్ లీగ్ పోటీలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రీడల ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక సమస్యలు తొలగిపోతాయని తెలిపారు. ఈ పోటీల్లో డాక్టర్ల టీములు పాల్గొంటున్నాయ న్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ లీగ్ మ్యాచ్ నిర్వాహకులు, టిడిఆర్ రెడ్డి, పైడా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు నౌకాదళ కమాండ్‌లో ప్రత్యేక ఎన్‌సిసి యాటింగ్ క్యాంప్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఇండియన్ నేవల్ సెయిలింగ్ అసోసియేషన్ (ఐఎన్ఎస్ఎ) ఆధ్వర్యాన ఐఎన్ఎస్ సర్కార్స్‌కు చెందిన ఇండియన్ నేవీ వాటర్‌మాన్‌షిప్ శిక్షణ కేంద్రం ద్వారా నవంబర్ 21 నుంచి 30 వరకు 10 రోజుల ప్రత్యేక ఎన్‌సిసి యాచింగ్ క్యాంప్‌ను నిర్వహించింది. ఈ క్యాంపులో ఏడు ఎన్‌సిసి డైరెక్టరేట్‌లకు చెందిన 28 మంది క్యాడెట్లు హిమాచల్ ప్రదేశ్, చండీగఢ్, యుపి, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఎపి, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, సిక్కిం, బీహార్ జార్ఖండ్ నుంచి శిబిరానికి హాజరయ్యారు. క్యాడెట్‌లకు వైఎఐ సిలబస్ ప్రకారం క్లాస్ రూమ్ సూచనలు ఆచరణాత్మక శిక్షణ నిర్వహించారు ఎంటర్‌ప్రైజ్ డింగీ, లేజర్ బహియా, లేజర్ స్టడీ, బిక్ నోవా విండ్ సర్ఫర్‌లపై ఆచరణాత్మకంగా శిక్షణ పొందారు.

పంచకర్లకు మైనార్టీ నాయకుల సత్కారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన పంచకర్ల రమేష్‌బాబుకు విశాఖ మైనారిటీ ముఖ్య నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహ్మాన్, మైనార్టీ నాయకులు ఐహెచ్ ఫరూఖీ, మహమ్మద్ సాదిక్, మహమ్మద్ ఇమ్రాన్, బర్కత్ అలీ, మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేవీ డే ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : నేవీ డే సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖ రానుండటంతో ఐఎన్ఎస్ డేగ, ఐఎన్ఎస్ చోళ, రాష్ట్రపతి ప్రయాణించు రహదారులు, నేవీ డే జరుగు ప్రాంగణం, నేవీ హౌస్ తదితర ప్రాంతాలను పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, నేవీ అధికారులు గురువారం పరిశీలించారు. ఏర్పాట్లపై సమీక్షించారు.

కనకమహాలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. దీనిని ముందుగానే గుర్తించి రెండవ గురువారం మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శిరీష తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకొని విశేష పూజలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి దాటాక శ్రీ అమ్మవారికి అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించాక భక్తులకు గురువారం అర్ధరాత్రి ఒంటి గంట నుండి దర్శనాలు కల్పించినట్లు పేర్కొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వియంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ఉన్నారు. ఉత్సవాలను ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

'జైళ్ల కంటే దారుణంగా సంక్షేమ హాస్టళ్లు'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాలు జైళ్ల కంటే దారుణంగా ఉన్నాయని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవి.ప్రణవ్‌గోపాల్ ఆరోపించారు. గురువారం టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో పలుచోట్ల హాస్టళ్ల శిథిలావస్థకు చేరుకున్నాయని, కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము స్వయంగా పరిశీలించిన తర్వాతే ఈ వాస్తవాలు చెబుతున్నామన్నారు. రాష్ట్ర మంత్రులు హాస్టళ్లను ఎందుకు సందర్శించడం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తు తమ లక్ష్యం అంటున్న సిఎం జగన్ సంక్షేమ హాస్టళ్ల మెస్ ఛార్జీలను పెంచలేదన్నారు. నాణ్యమైన ఆహారం అందించడం లేదన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE : AT ANAKAPALLE
O.S.No. 63 / 2021

Between :
Anga Ram Prasad . . . Plaintiff
And:
Buddaraju Radha Krishna Varma . . . Defendant

To:
Buddaraju Radha Krishna Varma, S/o. Late Jagannadha Raju, Business, R/at D.No. 13-5 Lakshmi Narasimha Nagar, Pendurthi, Visakhapatnam-531173

సదరు వాది మీ ఇరువురు మధ్య వ్రాసుకొన్న అగ్రిమెంటు తేది: 19-07-2014 ప్రకారము అమలు జరుపమని మీ మీదపైన వివరించిన వ్యాజ్యము దాఖలు చేసినందున మీరు సమన్లు తీసుకొనుటకు జాప్యము చేసినందున మీకు ఈ ప్రకటన ద్వారా **ది. 16-12-2022వ** వాయిదా అని తెలియజేస్తూ సదరు తారీఖున **పగలు 10-30 గంటలకు** మీరు స్వయముగా గాని వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరుఅయ్యి మీకు ఎటువంటి అక్షేపణలు వున్నయెడల వ్రాత పూర్వకముగా కోర్టుకి తెలియపర్చవలసినదని లేనిచో పై వ్యాజ్యము మీ పరోక్షమున విమర్శన చేసి తీర్మానించుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(By Order of the Court)
BH.R.N.MURTHY
K.SARITHA
Advocates for Plaintiff,
Visakhapatnam, Cell: 9290076426

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM
O.S. 405/2020

Between:
Hanumanthu Narayana Dora ...Plaintiff
And:
Vysyaraju Srinivas Raju ...Defendant

To,
Vysyaraju Srinivas Raju S/o Jaganadha Raju,MIG2/50,MVPColony,Vishakapatnam Town & District.

Please take notice that the above suit is posted to **12/12/2022** for your appearance in court. You are informed to appear on the said date at **10.30 A.M.** in the forenoon in person or through an Advocate and if you fail to appear on the aforesaid date the matter will be decided exparte on merits.

(Order of the Honourable court of the Principal Junior Civil judge at Srikakulam)

B.MADANA MOHAN RAO
Advocate for the Plaintiff,
New Colony, Srikakulam
Phone : 9440828340

పెందుర్తి నరవలో విట్స్ విద్యార్థుల అవగాహన ర్యాలీ

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- విశాఖపట్నం : జ్ఞానపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల,ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో హెచ్ ఐవి,ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. విశాఖపట్నం ఆదర్శ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ షకీనారాణి ముఖ్య అతిథిగా పాల్గొని ఎయిడ్స్‌కు కారణాలు, నిర్ధారణ పరీక్షలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులంతా రెడ్‌రిబ్బన్ గుర్తుపై మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్లు, ప్రగతి మిత్ర క్లబ్, రెడ్ రిబ్బన్ క్లబ్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె. మాణిక్యకుమారి, డాక్టర్ జె.నిర్మల, ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, పూర్ణానంద్, రాజేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

పెందుర్తి : నరవ విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని కాలేజీ చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ శ్రీధర్ పట్నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. యువత ఎయిడ్స్‌పై అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ వీరునాయుడు, పాల్గొన్నారు.

గీతంలో...: గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో రుషికొండ పరిసర గ్రామాలలో ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై చైతన్య ర్యాలీని ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లక్ష్మమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో అసోసియేట్ ప్రొఫెసర్ సిహెచ్.లావణ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి.మాలతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందపురం: వేములవలస కూడలిలో ఆర్ఎంపి, ఉత్తరాంధ్ర జోనల్ కార్యాలయంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కరపత్రాలను ముఖ్యఅతిథి ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపిల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి, జిల్లా కార్యదర్శి కడగళ్ల నారాయణరావు, పచ్చిపులుసు కనకారావు, రామకోటేశ్వరరావు జివి రాజు, పి.సుధాకరరెడ్డి, వరలక్ష్మి, అల్లాడ త్రినాధరావు, పల్లి వెంకటరమణ, పోలీసులు హేమంత్, ఆది పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీని ఆరోగ్య కేంద్రం వద్ద మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి ఉమారాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి సిద్ధార్ధ కుమార్, వైద్యులు కనక దుర్గ, పూర్ణిమ, వర్షిణి, సందీప్, ఒఖ, ఎన్ఎస్ఎస్ పిఒ పి.వేణుగోపాల్, డైట్ అధ్యాపకులు రవి పాల్గొన్నారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని మజ్జిపేటలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీలో సర్పంచ్ మజ్జి సూరినాయుడు, ఆర్ తాళ్ళ వలస, పిహెచ్‌సి సిబ్బంది శ్రీనివాసరావు, లింక్ వర్కర్ జ్యోతి పాల్గొన్నారు.

అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో

సంగివలస, అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల, ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ, పాథాలజీ, మైక్రో బయాలజీ విభాగాల ఆధ్వర్యంలో తగరపువలసలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అనిల్, డాక్టర్ బి రామకృష్ణ, డాక్టర్ వేణునాయుడు పాల్గొన్నారు.

ములగాడ: స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాంఅధికారి వై.అనసూయదేవి, వి.అంజలీదేవి, ఎన్.నదియా అధ్యాపకురాలు వై. ప్రేమలత, వాలంటీర్లు తనీషా వసంత పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బీచ్ రోడ్డులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కూటికుప్పల సూర్యారావు మాట్లాడుతూ, హెచ్ఐవి సోకగానే జీవితం ముగిసిపోదని, నేడు చికిత్సకు పూర్తిగా లొంగే వ్యాధి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రేడియో ప్రాంతీయ వార్తా విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ కొండలరావు, ఎన్ఆర్ఎస్ఐ మెడికల్ కాలేజ్ వైద్యులు డాక్టర్ డి. సుభాదేవి, ఏపి మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ అచ్యుతరావు పాల్గొన్నారు. కోల్‌కతా నృత్యకళాకారుల రిబ్బన్‌డాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రభుత్వ వృత్తివిద్య జూనియర్ కళాశాల మద్దిలపాలెం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన భానునగర్, కెఆర్ఎం కాలనీ మీదగా హెచ్‌బి కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.భీమోశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.రౌతు, గోపి, పివి రమణకుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఎయు క్వార్టర్‌లో యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టాఫ్ క్వార్టర్లో నివాసముంటున్న ఎంబిఎ విద్యార్థి పి.మాధవ్ (25) గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి త్రిటౌన్ పోలీసుల కథనం ప్రకారం... ఏయూలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పి.రత్నం క్వార్టర్‌లో నివాసముంటున్నారు. ఆమె భర్త డిల్లీశ్వరరావు నేవీల్లో ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యారు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మూడేళ్ల కిందట్ల కుమార్తె ఆత్మహత్య చేసుకుంది. ఒక కుమారుడు పి.మాధవ్ ఏయూలో ఎంబిఎ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇంకో కుమారుడు ఉద్యోగం చేస్తున్నాడు. తల్లి రత్నం అనారోగ్య సమస్యపై మనస్తాపం చెంది మాధవ్ ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నారు. మాధవ్ మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పోలీసులు కెజిహెచ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -మధురవాడ : కారు షెడ్ కూడలి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు పిఎం పాలెం సిఐ వై.రామకృష్ణ తెలిపారు. పిఎం పాలెం చివర బస్‌స్టాప్ ప్రాంతానికి చెందిన బెండపాటి నరసింహం దొర (68)కారుషెడ్ కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా, నగరం నుంచి మధురవాడ వైపు వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో దొర అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడు భార్య ఉషారాణి ఫిర్యాదు మేరకు హెచ్‌సి సిలారి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తుల నుంచి సొమ్ములను రికవరీ చేసి బాధితులకు అందజేయాలని కార్పొరేటర్ అక్కరమాని రోహిణి కోరారు. నిరుద్యోగులను ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తులను బాధితుల ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. గురువారం సంతపాలెంలో బాధితులతో విలేకర్ల సమావేశంలో రోహిణి మాట్లాడుతూ, వార్డు కార్పొరేటర్‌గా బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదును పోలీసులకు అందజేశారని, ఈ విషయంలో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. పార్టీ పేరు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తామన్న మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారి తరపున పోరాటం చేస్తామన్నారు.

శరవేగంగా 'నాడు నేడు' పనులు

ప్రజాశక్తి-గాజువాక :65వ వార్డు బాపూజీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక వంటశాల శ్లాబ్ పనులను వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు గురువారం ప్రారంభించారు. రూ.20 లక్షల నాడునేడు నిధులతో ఈ పనులను చేపట్టనున్నారు. వార్డు పరిధిలో నాడునేడు పనులు శరవేగంగా సాగుతున్నాయని, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రోత్సాహంతో వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీనివాస్, ఎల్వి. రమణ, హెచ్ఎం కెవిఎంఆర్ఎల్ దేవి, కమిటీ చైర్మన్ బాబ్జి, నారాయణమూర్తి, తేజ పాల్గొన్నారు

త్రోబాల్‌లో కణితి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -గాజువాక : త్రోబాల్ ఇండియా ఆధ్వర్యంలో హరియాణాలో నిర్వహించిన నేషనల్ యూత్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కణితి హైస్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన బి ముకేష్‌కుమార్, ఎం.జయసాయి తృతీయస్థానం సాధించారు. గత నెల 30న నిర్వహించిన మూడు జిల్లాల . అండర్ -17 త్రోబాల్ పోటీల్లోనూ వీరిద్దరితోపాటు సిహెచ్ నవీన్, బాలికల్లో సిహెచ్ సునీత, బి.హాసిని,డి దివ్య మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. మేయర్, స్థానిక ఎమ్మెల్యే నుంచి బహుమతులు అందుకున్న వీరిని హెచ్ఎం అభినందించారు.

అనధికార నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 26వ వార్డు నరవ కాంప్లెక్స్ ఎదురుగా నిర్మిస్తున్న భవనంలో అనధికారిక కాలమ్స్‌ను గుర్తించిన అధికారులు గురువారం వాటిని తొలగించారు. ఈ సందర్భంగా టిపిఓ తేజ మాట్లాడుతూ ఎసిపి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అనధికారిక నిర్మాణాలను తొలగిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఛైన్‌మ్యాన్ ప్రసన్నకుమార్, టౌన్ ప్లానింగ్ సెక్రెటరీలు పాల్గొన్నారు

సేవా కార్యక్రమాలతో 'గంటా' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- పెందుర్తి : వేపగుంటలోని గ్రేసియస్ చిల్డ్రన్ హోంలో 94వ వార్డు టిడిపి కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, గంటా శ్రీనివాస్ అభిమాని శైలజ, యూట్యూబర్ లత ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. గంటాకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్‌కట్ చేశారు. అన్నసమారాధన నిర్వహించారు టిడిపి నేతలు బొబ్బర నరసింహ నాయుడు, మామిడి కిరణ్, బొబ్బర ప్రసాద్ పాల్గొన్నారు.

మాధవధారలో వృద్ధులకు భోజనం పెడుతున్న టిడిపి నేతలు

మాధవధార: ఉత్తర ఎమ్మెల్యే గంటా జన్మదిన వేడుకలు 50వ వార్డు టిడిపి అధ్యక్షులు ససపల వరప్రసాద్, మహిళానేత బొడ్డేపల్లి లలిత ఆధ్వర్యంలో మురళీనగర్ వానప్రస్థ వృద్ధాశ్రమంలో నిర్వహించారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చిక్కాల విజయబాబు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసారు. కార్యక్రమంలో కట్ట కార్తీక్, ఈతలపాక సుజాత, జాన్, ప్రమీలరావు, ఆదిలక్ష్మి, శ్రీదేవి, పాల్గొన్నారు.

కంచరపాలెం: 54వ వార్డు లక్ష్మీనగర్ కాలనీలో వార్డు అధ్యక్షుడు కార్తీక్ కట్ట ఆధ్వర్యంలో ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. పలువురు వృద్ధులకు, మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ససపల వరప్రసాద్, ఉప్పాడ శేఖర్, సదరం గోపీనాథ్, పీల వెంకటరమణ శ్రీనివాస్, పరశురాంరెడ్డి, జెజె కుమార్, సుధాకర్, సోమేశ్, సురేష్ పాల్గొన్నారు.

ఆనందపురం: గంటా జన్మదినాన్ని పురస్కరించుకుని వేములవలస ఉపసర్పంచ్, టిడిపి యువనేత కోరాడ నవీన్ జ్ఞానేశ్వరరావు ఆధ్వర్యంలో పిహెచ్‌సిలో గర్భిణులు, రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. కేక్ కట్ చేశారు. ముడసల శీను, బాలు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

బివికె పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

చిన్నారులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- గాజువాక : షీలానగర్ బివికె పాఠశాలలో వైజాగ్ కిమ్స్ కడల్స్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.. ఈ శిబిరంలో పీడియాట్రిక్స్, డెంటల్, ఆప్తాల్మాలజీ విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని విద్యార్థులకు కంటి, దంత, ఇతర పరీక్షలు చేశారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు సంతోష్‌కుమార్ రౌతు, డాక్టర్ నిఖిల్ తేన్నేటి మాట్లాడుతూ చలికాలంలో పిల్లల ఆరోగ్యపరిరక్షణకు తగు సూచనలు చేశారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తమ పాఠశాలలోని ఒకటి నుంచి ఐదోతరగతి వరకు విద్యార్థులకు కిమ్స్ కడల్స్ ఆధ్వర్యంలో ఆరోగ్యపరీక్షలు నిర్వహించడంపై పాఠశాల ప్రతినిధులు కృష్ణమోహన్, జ్యోత్స్న, సుభాషిణి హర్షం వ్యక్తం చేశారు.

వైసిపి ప్రజా వ్యతిరేక పాలనపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : వైసిపి ప్రజా వ్యతిరేక పాలనపై టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా గురువారం 10, 12 వార్డుల టిడిపి నాయకులు మద్దిల రామలక్ష్మీ, 12వ వార్డు ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో ఆయా వార్డుల్లో నిరసన ప్రచారం నిర్వహించారు. పెద్ద ఎత్తున వార్డు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని, వార్డులో ఇంటింటికి వెళ్లివైసిపి ప్రజా వ్యతిరేక పాలనపై ముద్రించిన కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు గాడి సత్యం, భరత్, ఒమ్మి పోలారావు, యేడువాక సన్యాసిరావు, ముగడ రాజారావు, మద్దిల రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

పాఠశాలకు కుర్చీలు, ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి -తగరపువలస : మండలంలోని తాళ్ళ వలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు హెచ్ఎన్ఎస్ ఫౌండేషన్ అధినేత మూర్తి ఆధ్వర్యంలో గురువారం 10 కుర్చీలు, రెండు ఫ్యాన్లను పాఠశాల హెచ్ఎం ఎన్ అప్పారావుకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఈశ్వర్‌కుమార్, ఉపాధ్యాయులు ఇందుమతి, శ్యామల పాల్గొన్నారు

అన్నసమారాధన

ప్రజాశక్తి - ఆరిలోవ :కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శివ బాలయోగి మహారాజ్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదర్శనగర్ శివాలయంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు.రెండు వేల మంది పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.కార్యక్రమంలో స్వామి పరానందభారతి, కె.వెంకటేశ్వరావు, కె.మాధవి, వైస్ చైర్మన్ ఎం.వి.రావు, రమేష్ శర్మ పర్యవేక్షించారు.

జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ : 9వ వార్డు కార్పొరేటర్ కోరుకొండ స్వాతి దాస్ ఆధ్వర్యంలో గురువారం జోడుగుళ్లపాలెంలో జగనన్న ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. విశాఖ జిల్లా వైసిపి అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, తూర్పు సమన్వయకర్త, వియంఆర్‌డిఎ చైర్పన్ అక్కరమాని విజయనిర్మల పాల్గొని 500 మందికి పట్టాలు అందజేసారు. వార్డు ఇన్‌ఛార్జి ఉమ్మడి దాసు, రెడ్డి పాల్గొన్నారు.

రూ.17.30 లక్షలతో శ్రీనగర్‌లో పార్కు

ప్రజాశక్తి-గాజువాక: 72వ వార్డు శ్రీనగర్‌లో, గాజువాక జోనల్ కార్యాలయం వెనుక రూ.17.30లక్షలతో నిర్మించనున్న పార్కు పనులకు స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గాజువాక నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల కల్పన ద్వారా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జివిఎంసి ఎఇ నర్సింహమూర్తి, వైసిపి వార్డు ఇన్‌ఛార్జి సిరట్ల వాసు, స్థానిక వార్డు పెద్దలు వెంకటేశ్వరరావు, పుర్రె సత్యనారాయణ, లక్ష్మణరావు, సాలాపు రామారావు, బి.సత్యనారాయణ, అనురాధ, కొసిరెడ్డి లక్ష్మి, ప్రశాంతి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-కంచరపాలెం: కంచరపాలెం మెట్టు నుంచి ఊర్వశి జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న తోపుడుబళ్లు, చిరువ్యాపారాలను కంచరపాలెం ట్రాఫిక్ సిఐ మళ్ల అప్పారావు నేతృత్వంలో కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు, ఐదో జోన్ టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తొలగించారు. రహదారులను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

సంక్షేమ బోర్డు నిర్వీర్యం దారుణం

ఆందోళనలో మాట్లాడుతున్న పెంటారావు

ప్రజాశక్తి- ములగాడ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు రద్దు నిర్ణయాన్ని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా నాయకులు కె. పెంటారావు డిమాండ్ చేశారు. గురువారం 59వ వార్డు నెహ్రూ నగర్ లేబర్ జంక్షన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంక్షేమ బోర్డులోని కార్మికుల సొమ్మును బీమా కంపెనీలకు రూ.830 కోట్లు, పవర్ ఫైనాన్సు కార్పొరేషన్‌కు రూ.450 కోట్లు మళ్లించి కార్మికుల సంక్షేమ పథకాలు నిలుపుదల చేయడం దుర్మార్గమన్నారు. కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను జగన్ ప్రభుత్వం విడనాడాలని, సంక్షేమ బోర్డు రద్దు నిర్ణయాన్ని కేంద్రం వెనక్కు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్కాపురం జోన్ భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు జె. రామనాయుడు, ఎల్.రాంబాబు అప్పారావు, రాము, రాజు, రామారావు చిన్నారావు పాల్గొన్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో
శ్రీ కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో చైర్మన్ నరసింగరావు

ప్రజాశక్తి -తగరపువలస : ఈ నెల 30న ఆంధ్రా యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ ఫస్టియర్ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కళాశాల చైర్మన్ బి నరసింగరావు, ప్రిన్సిపల్ జె సతీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె చిట్టిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం గురువారం తెలిపారు. సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో బి.గాయత్రి 9.37/10 పాయింట్లు, మరగడ లోహిత 9.33, కుసుమ9.22,హరిత, వెంకటలక్ష్మీ మంచి గ్రేడింగ్ పాయింట్లు సాధించారని తెలిపారు. బీకామ్‌లో ప్రవీణ్ కుమార్ 8.50 గ్రేడింగ్‌తో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వీరే కాకుండా 9 పాయింట్లకు పైగా ఆరుగురు, 8 పాయింట్లకు పైగా 27 మంది ఉత్తీర్ణతతో యూనివర్సిటీ పరిధిలో 97 శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం కాలేజీలో చైర్మన్, ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి - గాజువాక : ప్రతిఒక్కరూ, ముఖ్యంగా యువత రక్తదానం చేయాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు మాట్లాడుతూ, 1998 నుంచి ఏటా తమ కాలేజీలో రక్తదనాం శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ డాక్టర్ రాధారాణి, వైస్ ప్రిన్సిపల్ ఎస్‌వి.కృష్ణ, బాలకృష్ణ, ఈశ్వరరాజు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎన్ఎస్‌టిఎల్‌లో
మెరైన్ ఇంజినీర్ల జాతీయ సదస్సు

ప్రజాశక్తి-కరాస : ఎన్ఎస్‌టిఎల్, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా సంయుక్త ఆధ్వర్యాన ఎన్ఎస్‌టిఎల్‌లో ఈనెల 2, 3 తేదీల్లో 'కాంటెంపరరీ డెవలప్‌మెంట్స్ ఇన్ మారిటైమ్ టెక్నాలజీ' థీమ్ మెరైన్ ఇంజనీర్స్ రెండు రోజుల 34వ నేషనల్ కన్వెన్షన్ ఆఫ్ మెరైన్ ఇంజనీర్స్ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్లు వై.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రెండు రోజుల సదస్సులో డిజిటల్ టెక్నాలజీ ప్రభావం, గ్రీన్ మెరైన్ ఎన్విరాన్మెంట్, అటానమస్ వెహికల్స్, ఆల్టర్నేటివ్ మెటీరియల్స్, హైడ్రోడైనమిక్ డిజైన్లు, రెన్యూవబుల్ ఎనర్జీ , డీప్ ఓషన్ ఎక్స్ప్లోరేషన్ వంటి సముద్ర రంగంలో తాజా పరిణామాలపై వత్తిపరమైన జ్ఞానాన్ని పంచుకోవడానికి ఇది వేదిక కానుందని తెలిపారు. కోల్‌కతాలోని ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ అభ్యర్థన మేరకు ఎన్ఎస్‌టిఎల్‌లో నిర్వహించనున్న జాతీయ సదస్సులో ఎన్ఎస్‌టిఎల్ హైడ్రోడైనమిక్ డిజైన్, నౌకల నమూనా పరీక్ష యుద్ధనౌక అభివద్ధిలో బీ స్టేల్త్, ప్రొపల్షన్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ వంటి సాంకేతికతలు, సైనిక, పౌర అనువర్తనాల అవసరాలను తీర్చడానికి, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా అవసరమైన పర్యావరణ వ్యవస్థ స్థాపనకు పరిశోధకులు,

వివరాలు వెల్లడిస్తున్న ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

భారతీయ పరిశ్రమలు, విద్యావేత్తలను ఉమ్మడి వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో 30 సాంకేతిక పత్రాలను సమర్పిస్తారన్నారు.. కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్‌సెంటర్ చైర్మన్ డాక్టర్ వి. భుజంగరావు, డిఫెన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్డ్ టెక్నాలజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సిపి రామనారాయణన్ ఎన్ఐఓటి చెన్నై డైరెక్టర్ డాక్టర్ జిఎ రామదాస్,. వైస్ అడ్మిరల్ శ్రీకుమార్ నాయర్ అతిథులుగా పాల్గొంటారన్నారు. మీడియా సమావేశంలో విశాఖపట్నం లోకల్ సెంటర్ అండ్ సిడిఆర్ చైర్మన్ పివిఎస్.గణేష్‌కుమార్, ఎంఆర్‌డిబి, ఐఇఐ చైర్మన్ డాక్టర్ భాస్కర్ ఎం.భండార్కర్ పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

51వ వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ రాజాబాబు

ప్రజాశక్తి- మాధవధార : 51వ వార్డులోని పలు ప్రాంతాల్లో జివిఎంసి కమిషనర్ రాజాబాబు, స్థానిక కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి గురువారం విస్తృతంగా పర్యటించారు. వెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక రజక సంఘాలకు దోబీ ఘాట్ ఏర్పాటు, చిట్టిబాబు కాలనీలో రిటైనింగ్ వాల్ నిర్మాణం, గాంధీనగర్ సర్వేనెంబర్ 9/2 ప్రభుత్వ స్థలంలో పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటు, భీమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను కూల్చేసి కొత్త భవనం నిర్మాణం, సింహాచలం దేవస్థానం అనుమతితో గిరిప్రదక్షిణ రోడ్డును జివిఎంసి నిధులతో పునర్నిర్మాణం, కళింగనగర్‌లో డ్రెయిన్లు తదితర సమస్యలను స్థానికులు కమిషనర్ దృష్టికి తేగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఐదో జోన్ కమిషనర్ కృష్ణ, ఫణిరామ్, వైద్యాధికారి కిషోర్, ఎఎంహెచ్ఒ రాజేష్, టౌన్ ప్లానింగ్ ఎసిపి అరుణవల్లి, టిపిఒ శ్రీలక్ష్మి, ఎపిడి పద్మావతి, సిఒ సునీల్, ఆర్ఐ పైడిరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, బి తిరుమలరావు, మెట్ట దమయంతి, శ్యామ్, పప్పల లక్ష్మణ్, గణేష్, రాణి బాబురావు, మోహనరావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి- గాజువాక : 74వ వార్డు సిద్ధేశ్వరంలో గుండెపోటుతో మృతి చెందిన తిప్పన సోమేష్‌రెడ్డి కుటుంబానికి వైఎస్ఆర్ బీమా కింద తక్షణసాయం రూ.10వేలను మృతుని భార్య సత్యవతికి వార్డు కార్పొరేటర్, వైసిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి గురువారం అందజేశారు. మృతుని కుటుంబానికి వైఎస్ఆర్ బీమా కిందర రూ.లక్ష పరిహారం మంజూరుకాగా, మిగిలిన మొత్తాన్ని నామినీ, మృతుని భార్య ఖాతాలో జమచేస్తామన్నారు. కార్యక్రమంలో గొందేశి అప్పలరెడ్డి, భూలోక, ధనరాజు, గురుమూర్తిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సిఒ సూర్యనారాయణ సచివాలయ అడ్మిన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు

బీమా సాయాన్ని అందజేస్తున్న వంశీరెడ్డి

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అలేఖ్య

అలేఖ్యను అభినందిస్తున్న హెచ్ఎం

ప్రజాశక్తి-పద్మనాభం.: అండర్ -14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని విజయానందపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల 7వ తరగతి విదార్థిని రేవళ్ల అలేఖ్య ఎంపికైందని హెచ్ఎం పి.నిర్మల తెలిపారు. పరవాడ మండలం, మేమర్తిలో జిల్లాస్థాయి పోటీల్లో మంచి ప్రతిభను కనబరచడం ద్వారా రాష్ట్ర పోటీలకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో అలేఖ్యను హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు, పిఇటిలు డి.వరలక్ష్మి, ఆర్.శంకరరావు అభినందించారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఇండియన్ మెడికల్ అసోసియేషన్, విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతి ఆశ్రమం ఉన్నతపాఠశాలలో వ్యాసరచన పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో 63మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రథమ బహుమతి పి.లలిత(పదవ తరగతి), ద్వితీయ బహుమతి సిహెచ్.ముక్తి (8వ తరగతి), మూడవ బహుమతి ఇ. నూకరత్నం (10వ తరగతి)లకు ఐఎంఎ విశాఖ శాఖ కోశాధికారి డాక్టర్ ఎంవివి.మురళీమోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎల్.కల్యాణ్‌ప్రసాద్ అందజేశాఆరు. ఎయిడ్స్ వ్యాప్తి చెందే మార్గాలు, నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం ధనలక్ష్మి, ఇన్‌ఛార్జి డివి.రెడ్డి పాల్గొన్నారు.

బహుమతులు అందిస్తున్న ఐఎంఎ ప్రతినిధులు

విద్యారంగానికి ప్రాధాన్యత
కస్తూర్బా జూనియర్ కాలేజీ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం వైసిపి ప్రభుత్వం విద్యారంగానికి తొలి ప్రాధాన్యనిస్తోందని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మూడోవార్డు గొల్లలపాలెం వద్ద రూ.కోటితో నిర్మించిన కస్తూర్బా విద్యాలయం జూనియర్ కాలేజీ నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, కస్తూర్బా పాఠశాలలో 2018లో ప్రారంభించిన జూనియర్ కాలేజీ విభాగానికి నాలుగు తరగతి గదులు, రెండు డార్మెటరీలు, ఐదేసి మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కస్తూర్బా ఎస్ఒ గంగాకుమారి అధ్యక్షతన జరిగిన సభలో సర్వ శిక్ష డిఇ డివి.నరసింహారావు, జెఇ ఫణీంద్ర కుమార్, ఎఇ మహాలక్ష్మి, జెడ్‌సి, ఎస్‌వెంకటరమణ, వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, వైసిపి నేతలు ఎం.షణ్ముఖరావు, ఎస్ కరుణాకరరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎగువపేట, తోటవీధి ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు చెరో రూ.20 లక్షలతో వాటర్ ట్యాంక్, కాలువల మరమ్మతు పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అల్లిపిల్లి నరసింగరావు, వి కొండబాబు పాల్గొన్నారు.

ఫ్రీడం కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : దాదిరెడ్డి పెద మునియమ్మ, నాగ దస్తగిరిరెడ్డి స్మారకార్థం స్థానిక జివిఎంసి మినీ క్రికెట్ స్టేడియంలో, అసోసియేషన్ ఆఫ్ భీమిలి క్రికెటర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రీడం కప్ -2022 పోటీలను గురువారం స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు టాస్ వేసి, బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ నెల 25 వరకు జరగనున్న టోర్నీలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, భోగాపురం మండలాలకు చెందిన 10 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహక ఎబిసి కార్యదర్శి అక్కరమాని లోవరాజు తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు పాల్గొన్నారు.

అన్నీ ఖాళీ స్థలాలే.. నిర్మాణాలేవి?

ముదపాక జగనన్న కాలనీ సందర్శనలో సిపిఐ నేతలు

ప్రజాశక్తి -పెందుర్తి : జగనన్న కాలనీల్లో అన్నీ ఖాళీ స్థలాలే తప్ప, తప్ప ఎలాంటి నిర్మాణాలు లేవని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంపైడిరాజు విమర్శించారు. పెందుర్తి మండలం ముదపాకలోని జగనన్న కాలనీని సిపిఐ బృ:దం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నేటికీ చేపట్టలేదని, ఇలాగైతే ఇళ్ల నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయని ప్రశ్నించారు. పేదలకు నిజంగా సొంతింటి వాళ్లను చేయాలనుకుంటే, నగరానికి దూరంగా 35కిలోమీటర్ల దూరంలో స్థలాలు కేటాయిస్తే అక్కడ ఇళ్ల నిర్మాణం, జీవనం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణంలో జాప్యాన్ని నిరసిస్తూ, జిల్లా, మండల రెవిన్యూ, మున్సిపల్ కార్యాలయాల వద్ద లబ్ధిదారులతో ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడించారు. పర్యటనలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసరావు, ఎ.విమల, సిఎన్ క్షేత్రపాల్, నాయకులు విజయ, రవనమ్మ, ఆసిరినాయుడు, రాము, శ్రీను, శ్రీరాము, ఈశ్వరరాజు, గోవిందా, మిన్నారావు పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితుల సమస్యలపై కాలయాపన సరికాదు

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి - రాంబిల్లి

నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలపై జిల్లా కలెక్టర్ నిర్వాసిత పెద్దలతో మూడుసార్లు చర్చలు జరిపినా వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా, కాలయాపన చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మండిపడ్డారు. తమ సమస్యలపై నేవీ మెయిన్ గేట్ ముందు ఎనిమిది గ్రామాల నేవీ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన గురువారం నాటికి 32వ రోజుకు చేరింది. ఈ ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేసిన లోకనాథం మాట్లాడుతూ నేవీ నిర్వాసితుల భూములు, శారద, వరాహ నదులు తీసుకొని వారికి జీవించడానికి మార్గం చూపించకపోవడం బాధాకరమన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. నేవీ నిర్వాసితుల సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఒకపక్క నేవి గేట్లు బంధించి, డ్రెడ్జింగ్ పనులు చేపట్టి, మరో వైపు జెట్టీ కట్టే అవకాశం లేకపోతే నిర్వాసిత మత్స్యకారులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఎన్ఎఒబి ప్రాజెక్టు వచ్చినప్పుడే నిర్వాసిత గ్రామాలను గుర్తించడంలో తీవ్ర లోపం జరిగిందని, గోవిందపాలెం, చిన్న కలవలపల్లి, వాడ రాంబిల్లి, కొత్తపేట గ్రామాల ప్రజలు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం సీరియస్‌గా జోక్యం చేసుకొని నిర్వాసితుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనకు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడునాయుడు, 8 గ్రామాల ప్రజాప్రతినిధులు, వేలాదిమంది నిర్వాసితులు పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితుల ఆందోళనలో మాట్లాడుతున్న లోకనాథం

ఎన్‌టిపిసి అధికారులతో డిఎఫ్ఒ అనంత్ శంకర్

అనంతగిరిలో కమ్యూనిటీ బెస్ట్ ఎకో టూరిజం

ప్రజాశక్తి - పరవాడ

ఎన్‌టిపిసి ఎస్ఆర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్స్ కింద అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరిలో 'కమ్యూనిటీ బెస్డ్ ఎకో టూరిజం' మూడేళ్ల ప్రాజెక్టుకు ఎన్‌టిపిసి, అటవీశాఖ మధ్య ఒప్పందం జరిగింది. గురువారం విశాఖ అటవీశాఖ అధికారి అనంత్ శంకర్ ఎన్‌టిపిసి అధికారులతో సమావేశమయ్యారు. ఇందులో రూ.550 లక్షలతో 3 సంవత్సరాల ప్రాజెక్ట్‌కు ఎన్‌టిపిసి సింహాద్రి చీఫ్ జనరల్ మేనేజర్ గిరీష్ చంద్ర చౌక్, డిఎఫ్ఒ అనంత్ శంకర్ ఒప్పందంపై సంతకం చేశారు. దీని ప్రకారం ఎన్‌టిపిసి 2022-23లో రూ.250 లక్షలు, 2023-24, 2024-25 సంవత్సరాలు మిగిలిన మొత్తం వాయిదాల్లో ఆర్థిక సాయం అందించనుంది. ప్రారంభంలో సిబిఇటి ప్రాజెక్ట్ కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను ఎన్‌టిపిసి, జిల్లా అటవీ శాఖ అభివృద్ధి చేయాలని, సమీప గ్రామాల గిరిజనులు, వన సంరక్షణ సమితి సభ్యులకు అవసరమైన శిక్షణ ఇచ్చిన తర్వాత గిరిజన సమాజానికి అప్పగించబడుతుందని అధికారులు తెలిపారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని అనంతగిరిలో సౌకర్యాలు, అటవీ సంరక్షణ, సమాజ అభివృద్ధి పనులకు ఉపయోగించాలని నిర్ణయించారు.

కోర్టు సన్నివేశంలో నటిస్తున్న మళ్ల సురేంద్ర

హిట్2 సినిమాలో నటించిన మళ్ల సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి : ఫ్యాన్ ఇండియా సస్పెన్స్ థ్రిల్లర్స్ మూవీ హిట్2 చిత్రంలో టిడిపి బీసీ సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నటించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హీరో నాని సమర్పణలో, శైలేష్ కొలను దర్శకత్వంలో అడవి శేష హీరోగా, మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు చెప్పారు. చిత్రంలో తనకు అవకాశం కల్పించిన చిత్ర దర్శకులు నిర్మాతకు, చిత్ర బృందానికి సురేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి - పరవాడ : జివిఎంసి 79వ వార్డు లంకలపాలెం శ్రీరంగ కాలనీలో తడి, పొడి, ప్రమాదకరమైన చెత్త నిర్వహణపై జివిఎంసి గాజువాక జోనల్ కమిషనర్ అవగాహన కల్పించారు. ఈ చెత్తను వేరు చేసి జివిఎంసి వాహనాలకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమం వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, శానిటరీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి : నాగజగదీష్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగజగదీష్, కుమార్, బత్తుల

ప్రజాశక్తి- అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులు, ఖర్చులపై శ్వేత పత్రం విడుదల చేయాలని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో 'ఇదేం కర్మ' పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి మూడున్నర ఏళ్ల పాలనలో రూ.5 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. ఇందులో కేవలం లక్షా 50 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి మిగిలిన మొత్తాన్ని స్వాహా చేశారని ఆరోపించారు. టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సాగు, తాగునీటి ప్రాజెక్టులకు ఒక్క రూపాయి విడుదల చేయలేదన్నారు. చోడవరం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు.

వైసిపి పాలనలో అభివృద్ధి కంటే అవినీతి ఎక్కువ

వైసిపి ప్రభుత్వ మూడున్నర ఏళ్లలో అభివృద్ధి కన్నా అవినీతి ఎక్కువగా జరిగిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. మండలంలోని చింత నిప్పుల అగ్రహారంలో గురువారం 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్ అనకాపల్లికి పట్టిన కర్మ అని ఎద్దేవా చేశారు. తుమ్మపాల ఫ్యాక్టరీని మూత వేయించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోట్ని బాలాజీ, మళ్ల సురేంద్ర, కాయల మురళి, శరగడం ఆదిబాబు, ముమ్మిన పైడిరాజు, దాడి పెంటారావు, దంట్ల సూరిబాబు, మద్దాల వెంకటేష్, పివి.నాయుడు, సందిన సునీల్, మరపు రెడ్డి సత్యనారాయణ, చందక నరసింగరావు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ఆయకట్టుదారులకు ఇక్కట్లు

ప్రజాశక్తి- అనకాపల్లి : అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆయకట్టుదారులకు ఇక్కట్లు తప్పడం లేదని అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం నాయకులు కార్యదర్శి విల్లూరి రాము, భీశెట్టి కృష్ణ అప్పారావు అన్నారు. గురువారం జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ జాతీయ రహదారి అధికారులు నీటిపారుదల వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. అనకాపల్లి -ఆనందపురం రోడ్డు నిర్మాణంతో రెండేళ్లుగా శారదానది నీరు, భారీ వర్షాల వల్ల వ్యవసాయ భూములకు ముంపు ఏర్పడిందని, సుమారు వెయ్యి ఎకరాలకు నష్టం జరిగిందని తెలిపారు. చెర్లోపల్లి ఉపకాల్వలు, నడిమి గెడ్డ, మెరక, పులి కాలువ, 9 వీసాలు, శ్రీపతివాణి కాలువలు పూడ్చిపెట్టారన్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని చెప్పారు. సకాలంలో అధికారులు స్పందించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు కొణతాల శ్రీనివాసరావు, కెవి సూర్యనారాయణ, ఎంఎన్ఎస్ అప్పారావు, కొణతాల సూరి అప్పారావు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మికుల ఆందోళనలు

అనకాపల్లిలో ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ స్థానిక సర్వకామదాంబ పార్కు వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ 2019 నుంచి ఆగిపోయిన క్లైమ్‌లను పరిష్కరించాలన్నారు. కరోనా రెండేళ్ల కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని, ఇప్పుడు సంక్షేమ బోర్డును రద్దు చేయడం ద్వారా కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పెయింటర్ యూనియన్ అధ్యక్షులు వై.సూర్యనారాయణ, కార్యదర్శి పి.పురుషోత్తం, కోశాధికారి ఎ.శ్రీను, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...

అచ్యుతాపురం : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధులు రూ.1200 కోట్లు ప్రభుత్వం దారి మళ్లించిందని, తక్షణమే ఆ నిధులను బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.రాము, మండల కార్యదర్శి కె.సోమునాయుడు, నాయకులు అప్పలనాయుడు, రాజు, చిన్న అచ్చంనాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని జె.తుని సచివాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ సిమెంటు, స్టీల్, రంగులు తదితర ధరలు తగ్గించాలని, ఇసుకను అందుబాటు ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పోలయ్య, మజ్జి శ్రీరాము, మజ్జి రమణ, తిర్రి రమణ, తిర్రి బాబు రావు పాల్గొన్నారు.

సబ్బవరం : భవన నిర్మాణ కార్మిక సంఘం



కశింకోటలో...

ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి గొంతిన అప్పారావు(చంటి) మాట్లాడుతూ జిల్లాలో భవన, ఇతర నిర్మాణ కార్మికులు సుమారు లక్ష మంది ఉన్నారని, వారికి సంక్షేమ పథకాలను నిలిపి వేస్తూ ప్రభుత్వం ఇచ్చిన మెమో 1214 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోపి సత్యం, ఏలూరి వెంకట రమణ, త్రినాథ్, గొంప ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

జాతీయ రహదారిపై ప్రతిపాదనలు

ప్రజాశక్తి- చోడవరం

కాకినాడ జిల్లా తుని నుంచి నర్సీపట్నం, వడ్డాది, చోడవరం మీదుగా సబ్బవరం వరకు జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను నేషనల్ హైవే, ట్రాన్స్‌పోర్టు డైరెక్టర్ జనరల్ రవి ప్రసాద్‌కు అందజేసినట్లు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. ఢిల్లీలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌తో కలిసి రవి ప్రసాద్‌ను కలిసినట్లు చెప్పారు. ఈ హైవే నిర్మాణం జరిగితే ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటాయని తెలిపారు. దీనికి రవి ప్రసాద్ సానుకూలంగా స్పందించారని చెప్పారు.

నేషనల్ హైవే అధికారితో సమావేశమైన ధర్మశ్రీ, గుడివాడ

స్థానికులతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

వైసిపి ప్రభుత్వం హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని లంకవానిపాలెం, దీక్షితులఅగ్రహారం గ్రామాల్లో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పథకాలపై ఆరా తీశారు. మంచినీటి పథకాలు, ఇంటింటి కుళాయిలు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. లంకవానిపాలెంలో ఇళ్లపై వెళ్లే హై టెన్షన్ వైర్లను మార్చాలని ఆ గ్రామ సర్పంచ్ వేచలపు దొరబాబు కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి అనురాధ, ఎంపిపి రెడ్డి జగన్మోహన్, ఎంపిడిఒ శచీదేవి, పలువురు సర్పంచ్‌లు, వైసిపి నాయకులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాంబిల్లి : సిఐటియు జిల్లా మహాసభ పోస్టర్‌ను మండలంలోని వై.లోవ గ్రామంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి దేవుడునాయుడు మాట్లాడుతూ ఈ మహాసభల్లో జిల్లాలో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, లేబర్ కోర్స్ రద్దు చేసి 44 చట్టాలు అమలు చేయాలని, కాంట్రాక్ట్, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నానాజీ, వరహాలరావు, సూరిబాబు, దొరబాబు, నర్సింగరావు, హరికృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇరిగేషన్ కాలువలో వ్యర్థాల తొలగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి ఆధ్వర్యంలో గురువారం తుమ్మపాల- బొజ్జన్న కొండకు వెళ్లే రహదారిలో మరిడిమాంబ ఆలయం సమీపంలో ఉన్న ఇరిగేషన్ కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను జెసిబి, ట్రాక్టర్ల సహాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో మండల బడ్జెట్

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం మండల పరిషత్ బడ్జెట్ రూ.5 కోట్లతో సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఎంపిపి కోన సంధ్య అధ్యక్షతన మండల బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో విజయ శ్రీ విజయలక్ష్మి బడ్జెట్ ప్రతులను సభ్యులకు అందజేశారు. 2021-22 ఖర్చుల ఆమోదం, 2022-23 సవరణ బడ్జెట్ ఆమోదం, 2023-24 సంవత్సరం అంచనా బడ్జెట్ ఆమోదం జరిగింది. ఈ బడ్జెట్ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను గురువారం గంటా అభిమాని మీగడ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రెల్లి కాలనీలో బర్త్ డే కేకును కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న టిడిపి శ్రేణులు

బేవరేజెస్ హమాలీల కూలి రేట్లు పెంచాలి

రెండో రోజు కొనసాగిన ఆందోళన

ఆందోళన చేస్తున్న బేవరేజెస్ హమాలీలు

ప్రజాశక్తి- అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ అనకాపల్లి డిపో హమాలీలు తమకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ చేపట్టిన ఆందోళన రెండో రోజు కొనసాగింది. ఇందులో భాగంగా గురువారం డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం డిపో కమిటీ గౌరవ అధ్యక్షులు గంట శ్రీరామ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ ఎగుమతి కూలిరేట్లు రూ.7 నుంచి రూ.10కు పెంచాలని, ఏరియర్స్ సహా పాత బకాయిలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంటి అద్దెలు, నిత్యవసర వస్తువుల ధరలు, వైద్య ఖర్చులు, పిల్లల చదువుల భారం పెరిగిన నేపథ్యంలో ఆ మేరకు కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. అగ్రిమెంట్ పూర్తయి ఏడాది కావస్తున్నా కొత్త అగ్రిమెంట్ చేయకపోవడం అన్యాయమన్నారు. దీనిపై పలు పర్యాయాలు కంపెనీ ఎమ్‌డి, సిగ్మా కంపెనీ కాంట్రాక్టర్, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సంబంధిత మంత్రికి తెలియజేసినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. సమస్య పరిష్కరించుకుంటే ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జీరు కనక రమణ, కరణం కొండారావు, బిసి నాయుడు, లక్ష్మణ, ఐ.రాఘవరావు, హమాలీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వడ్డాది, విజయరామరాజు పేట జెడ్‌పి హైస్కూల్ల విద్యార్థులు

ప్రజాశక్తి -వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్ 30న అనకాపల్లిలో జరిగిన జూనియర్ ఛాంపియన్ షిప్ పాఠశాలకు చెందిన వి.యామిని, కె.కల్పన, ఎ.ధనుశ్రీ, టి.సంజయ్ గెలుపొందారు. వీరు వచ్చే నెల 3 నుండి 5వ తేదీ వరకు కాకినాడలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జూడో సెక్రటరీ సిహెచ్.శ్యామూల్ రాజ్ తెలిపారు గెలుపొందిన విద్యార్థులను హెచ్ఎం పివి శేషుబాబు, పిడి కడగళ్ల నారాయణమ్మ, పిఇటి ఎల్.అప్పలనాయుడు అభినందించారు.

రాష్ట్రస్థాయి టెన్ని కాయిట్ పోటీలకు....

అనకాపల్లి జిల్లా లేమర్తిలో నవంబర్ 30న జరిగిన మూడు జిల్లాల టెన్ని కాయిట్ పోటీల్లో బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట జెడ్పి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. టెన్నికాయిట్ బాలుర సీనియర్ విభాగంలో బి.లీలాప్రసాద్, బాలికల సీనియర్ విభాగంలో సిహెచ్.రమ్య, కె.సంతోషి, బాలికల జూనియర్స్ విభాగంలో ఆర్.నవ్య కుమారి, ఎస్ గీతు గెలుపొందారు. వీరు డిసెంబర్‌లో కడప జిల్లాలో జరుగు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారని పిడి ఎ.నాగరాజు తెలిపారు. విజేతలను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు డి.వరాహమూర్తి, ఎస్ఎంసి చైర్మన్ ఎస్.వెంకట అప్పారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

హరిపాలెం విద్యార్థుల ఎంపిక

అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులు 8 మంది ఇటీవల జరిగిన వాలీబాల్, త్రో బాల్, ఖోఖో, అథ్లెటిక్స్‌లో పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వై.జగదీశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు కె.శైలు, కె.లక్ష్మి ప్రసన్న, బి.అజయ్, కె.భరత్, ఎన్.అఖిల, ఈశ్వర్, అశోక్, బాలశ్రీ ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ ధర్మిరెడ్డి రాజును వైసిపి మండల నాయకులు మారిశెట్టి సూర్యనారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో కెఆర్ కుమార్, టి వెంకటేష్, వి గాంధీ, ఎస్‌కె బాషా, బాలకృష్ణ, హైమావతి, అమ్మాజీ, రమణి, పట్నాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చదరంగం ఆడుతున్న విద్యార్థులు

గొన్న కళాశాలలో చదరంగం పోటీలు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గొన్న కళాశాలలో గురువారం యూనివర్సిటీ లెవెల్ ఇంటర్ కాలేజియేట్ చెస్ టోర్నమెంట్, సెలక్షన్ ట్రైల్స్ నిర్వహించారు. విజయనగరం జెఎన్‌టియు అనుబంధంలో వున్న కళాశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొన్న కళాశాల సెక్రెటరీ గొన్న హేమచంద్ర నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా ఇతర ఆసక్తికరమైన రంగాలలోనూ రాణించాలన్నారు. ఈ చెస్ పోటీలకు యూనివర్సిటీ అబ్జర్వర్‌గా డాక్టర్ పిఎస్‌వి రమణ, స్పోర్ట్స్ అధిపతిగా కె.రాంబాబు వ్యవహరించారు. ప్రిన్సిపాల్ పిఎస్ఎన్ మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

200 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కశింకోట : మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో భాగంగా కశింకోట గ్రామంలో 200 మంది పేదలకు దుప్పట్లు, పళ్ళు గురువారం పంపిణీ చేశారు. ముందుగా పుట్టినరోజు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, సిదిరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, కలగా సోమేశ్వరరావు, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, తాకాశి కృష్ణ, దుర్గనాయుడు, జెర్రిపోతల నూకి నాయుడు పాల్గొన్నారు.

నిరాహార దీక్ష చేస్తున్న పివిఎస్ఎన్.రాజు, జనసేన నాయకులు

వడ్డాది వంతెన పునరుద్ధరణకు 48 గంటల దీక్ష

ప్రజాశక్తి-వడ్డాది

శిథిలమైన వడ్డాది వద్ద వంతెనను పునరుద్ధరించాలని కోరుతూ జనసేన చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు 48 గంటల నిరవధిక నిరాహార దీక్ష గురువారం చేపట్టారు. ఆయనకు మద్దతుగా ఆ పార్టీ కార్యకర్తలు దీక్షల్లో కూర్చున్నారు. ముందుగా వడ్డాది నాలుగు రోడ్ల కూడలిలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కూడలిలో రాస్తారోకో చేశారు. అక్కడినుండి వంతెన వరకు ర్యాలీగా తరలివచ్చి వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వంతెన సమస్య స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి పట్టదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే జనసేన కార్యకర్తలంతా ఇంటింటికి వెళ్లి భిక్షాటన చేసి వంతెన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. జనసేన విశాఖ ఉత్తర, గాజువాక నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పసుపులేటి ఉషాకిరణ్, కోన తాతారావు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఏడిద భార్గవ్, గండి దుర్గాప్రసాద్, రాయపరెడ్డి కృష్ణ, డిఎస్.నాయుడు, యడ్ల రామ్మూర్తి, దొండా సాయి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు పోరాటం

ప్రజాశక్తి-అనకాపల్లి : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాటానికి సిద్ధం కావాలని ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. మండలంలోని మూలపేటలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను అధికారంలోకొస్తే మూడు నెలల్లో భవన నిర్మాణ కార్మికులకు భద్రత కల్పిస్తానని, సంక్షేమ బోర్డు ద్వారా గత ప్రభుత్వం కంటే మెరుగైన సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు అందుకు భిన్నంగా సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఇసుక పాలసీ పేరుతో ఇసుక దొరక్కుండా చేసి భవన నిర్మాణ కార్మికుల ఉపాధికి గండికొట్టారన్నారు. ఈ సమావేశంలో చిన్ని చిన్న, శీర అప్పలరాజు, ఉప్పులి సత్తిబాబు, పల్లా నరసింగరావు, ఆదినారాయణ, జి రామనాయుడు, సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రమాద ప్రదేశాల్లో స్టాపర్ బోర్డులు

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : యలమంచిలి జాతీయ రహదారిపై ఇటీవలే వరుస ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని నివారించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో నెల రోజుల్లోనే ప్రమాదాల వల్ల సుమారు పదిమంది మరణించారు. ఈ ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు ఆధ్వర్యాన పోలీసులు నిత్యం ప్రమాదాలు జరిగే కొక్కిరాపల్లి, రేగుపాలెం, పులపర్తి జంక్షన్ల వద్ద రేడియం స్టిక్కరింగ్, డ్రమ్స్, స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్రమాద స్థలంలో డ్రమ్ ఏర్పాటు చేస్తున్న పోలీసులు

పింఛన్లపై విచారణ

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలో వికలాంగుల ధ్రువ పత్రాలను ఎంపిడివో అరుణశ్రీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో వికలాంగుల ధ్రువపత్రాల ద్వారా పింఛన్లు పొందేవారు పత్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. శెట్టిపాలెం, జంగాలపల్లి, జెడ్. గంగవరం గ్రామాలకు చెందిన పది మంది వికలాంగుల ధ్రువపత్రాలను పరిశీలించారు.

విచారణ చేపడుతున్న అధికారులు

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు

ప్రజాశక్తి- చీడికాడ:రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. చీడికాడ తహసిల్దార్ కార్యాలయం ఆధునీకరణలో భాగంగా నిర్మించిన ప్రహరీ గోడను ముత్యాల నాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తహసీల్దార్ కార్యాలయం ఆధునికరణకు కృషి చేసిన తహసిల్దార్ బివి రాణిని అభినందించారు. రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించడానికి జగనన్న భూ రీసర్వేను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ రీ సర్వేతో ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు.

తహసిల్దార్ బివి రాణి మాట్లాడుతూ, మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంకు తన వంతు కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి, జడ్పిటిసి లాలం శారదా వరలక్ష్మి జానకిరామ్, మండల వైసీపీ కన్వీనర్ గొల్లవిల్లి రాజుబాబు, యూత్ కన్వీనర్ గొల్లవిల్లి స్వామి నాయుడు, మండల వ్యవసాయ వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఎర్ర అప్పారావు, వైసిపి నాయకులు పరువాడ అప్పారావు, మహేష్ రామారావు, బొడ్డ అప్పలనాయుడు, సుంకరి శ్రీనివాసరావు, డిటి రమేష్ ఆర్ఐలు, వీఆర్వోలు, పాల్గొన్నారు.

ప్రహరీ గోడను ప్రారంభిస్తున్న ముత్యాలనాయుడు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- మాకవరపాలెం: మండలంలో పలు గ్రామాల్లో ఈనెల 2న విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కన్నూరుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న రామన్నపాలెం 11 కెవి. భీమబోయన్ పాలెం. ఫీడర్ మరమ్మతులు చేపడుతున్నట్లు తరుణంలో శెట్టి పాలెం, జెడ్ గంగవరం, రాజపేట, ఎరకన్నపాలెం, వెంకటాపురం పంచాయతీలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుండి. మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా. నిలిపి వేస్తున్నట్లు. తెలిపారు

సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో పికేపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన సారా పులుపును గురువారం స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై నారాయణరావు మాట్లాడుతూ, సుమారు 400 లీటర్ల సారా పులుపుని ధ్వంసం చేసామని తెలిపారు.

బాధితునికి సహాయం

ప్రజాశక్తి-మాడుగుల:అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్న బాధితునికి మాడుగుల భారత నిర్మాణ సేన సభ్యులు సహాయం అందించారు. మాడుగుల నియోజకవర్గ పరిధిలోని చీడికాడకు చెందిన కొనగల సత్యనారాయణ టిఫిన్ సెంటర్‌తో జీవనోపాధి పొందుతున్నారు. ఐదు సంవత్సరాలుగా ఊపిరి తిత్తుల వ్యాధితో చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధికి సంబంధించి ఆక్సిజన్ కిట్ ప్రతిరోజూ అవసరం కావడంతో, మాడుగుల భారత్ నిర్మాణ సేన స్పందించి అనకాపల్లి ఏటిఐఎఫ్ సహకారంతో ఆక్సిజన్ కిట్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేన సభ్యులు మధు, జాని ఈశ్వరరావు, రాంకీ, వెమావరపు అశోక్, చేట్రోలు జగన్, గౌరిపట్టపు మహేష్, తవ్వా సన్యాసి శెట్టి తదితరులు పాల్గొన్నారు.


ఆక్సిజన్ కిట్లు అందిస్తున్న సభ్యులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి-చీడికాడ:ఈనెల 13న అనంతగిరిలో ప్రమాదానికి గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. చీడికాడ మండలం కండివరం గ్రామానికి చెందిన గుల్లిపల్లి కాసులమ్మ ఈ నెల 13న అనంతగిరిలో ప్రమాదానికి గురై విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న పెద్దిరాజు

రైతులకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని రావణాపల్లి గ్రామ సచివాలయంలో ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ ఆదేశాల మేరకు గురువారం పెసలు, మినుములు విత్తనాలను ఎఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమిర మాకిరెడ్డి బాబులు, కొల్లు గంగునాయుడు, మడగల పైడియ్య, కొల్లు నూకరాజు, ఎంపిఇఒ మహాలక్ష్మీ, సచివాలయం సిబ్బంది మనోజ్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు, జెడ్‌పిటిసి

మహిళల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -కోటవురట్ల: మహిళ రక్షణ చట్టాలపై అధికారులు, జెడ్‌పిటిసి సభ్యులు అవగాహన కల్పించారు. స్థానిక సిడిపిఓ కార్యాలయం వద్ద గురువారం సిడిపిఓ సుజాత అధ్యక్షతన అంగన్వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, తహశీల్దారు జానకమ్మ మాట్లాడుతూ, సమాజంలో ఎదురవుతున్న సమస్యలను ప్రతిఘటించేందుకు విద్యార్థి దశ నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. సిడిపిఓ సుజాత మాట్లాడుతూ, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ కన్యాకుమారి, వివిధ మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎఎంఎఎల్ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయ బాబు మాట్లాడుతూ శరీరంలో ఎయిడ్స్ వైరస్ సోకితే రోగ నిరోధక శక్తి తగ్గుతుందని, ఇమ్యూనిటీ పెంచుకునేందుకు తగిన మందులు వాడుతూ ఎప్పటిలాగే జీవించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కెవిఎస్ మహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎం.హరిబాబు, నిరంజన్ కుమార్, మణి, సౌజన్య పాల్గొన్నారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చల్లా నరసింహం, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.తిరుపతిరావు ఆధ్వర్యంలో కశింకోట గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వివాహేతర సంబంధాలు ఉండరాదన్నారు. సిబ్బంది సత్యనారాయణ, మురళీకృష్ణ, ఆశలు పాల్గొన్నారు.


మాడుగులలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కె.కోటపాడు : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సమీకృత సలహా, పరీక్ష కేంద్రం ఆధ్వర్యంలో అయ్యన్న విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించి, మూడు రోడ్ల కూడలి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ డి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ విచ్చలవిడి శృంగారం వల్ల ఎయిడ్స్ బారిన పడే అవకాశం ఉందన్నారు. ఐసిటిసి కౌన్సిలర్ దేవుడు బాబు. ల్యాబ్ టెక్నీషియన్ వి.గంగు నాయుడు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం పిహెచ్‌సి ఆధ్వర్యంలో విద్యార్థులు, వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారి కళ్యాణి, సిబ్బంది మహేశ్వరి, ఇంద్ర, నాగేశ్వరరావు, వరలక్ష్మి, దేవి, రత్నకుమారి, సరస్వతి పాల్గొన్నారు.

చోడవరం : ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలు అవగాహనతో ఉండాలని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే వ్యాధి తగ్గుముఖం పట్టిందని, మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటే పూర్తిగా దూరమవుతుందన్నారు. ఆసుపత్రి వైద్యులు, ఐసిటిసి కౌన్సిలర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల:మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సివిఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ, విద్యార్థులు ఈ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండటంతో పాటు, ఇతరులతో చర్చించే విధంగా ఆలోచన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారి సంతోష్ కుమార్, ఐసిటిసి కౌన్సిలర్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జయ లక్ష్మి, పైడి రాజు, షర్మిల, రామ్ కుమార్, సులోచన, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

కోటవురట్ల: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండలంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి గోవిందరావు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని భగవాన్ శ్రీ సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ శ్రీ సత్య సాయి భజన మండలి సభ్యులు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు.ఎయిడ్స్ బాధితులకు న్యూట్రిన్ ఫుడ్స్ అందించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ శర్మ, రాజబాబు, పి.చిట్టిబాబు, రమేష్, సూరప్ప రాజు, జగన్నాథరాజు పాల్గొన్నారు.

హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

'ఉపాధి హామీ' పనులపై ప్రజా వేదిక

ప్రజాశక్తి- మాకవరపాలెం: మండలంలో ఉపాధి హామీ పనులపై జరిగిన ప్రజా వేదిక సమావేశం తూ తూ మంత్రంగా ముగించారు. గత రెండు ఏళ్ల పాటు మండలంలో జరిగిన ఉపాధి పనులపై మండల పరిస్థితి కార్యాలయం వద్ద ప్రజా వేదిక సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా సోషల్ ఆడిట్ సిబ్బంది నివేదికను చదివి వినిపించారు.టిడిపి ప్రభుత్వంలో నిర్వహించిన గోశాల షెడ్లకు బిల్లులు రాలేదని గ్రామాల్లో రైతులు చెబుతున్నారని సోషల్ ఆడిట్ సిబ్బంది తెలిపారు. రాచపల్లి గ్రామంలో 2018లో 175 ఇంకుడు గుంతలు తవ్వగా నేటికీ బిల్లు రాలేదని మాజీ సర్పంచ్ పెట్ల దొరబాబు తెలిపారు.

2021 నుంచి 2023 వరకు జరిగిన 2418 పనులకు గాను 39.27.833.50. కోట్లు రూపాయలు తో జరిగిన పనులకు గాను సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏపిడి రోజా రాణి, ఎంపీపీ సత్యనారాయణ, విజిలెన్స్ డీఈవో నిర్మలాదేవి, ఎంపీడీవో అరుణశ్రీ, వైస్ ఎంపీపీ రాజారావు, ఎస్ఆర్‌పి రాజు, ఏపిఓలు పాల్గొన్నారు.

హెటిరో పైప్‌లైన్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దు

సింహగర్జన బహిరంగ సభలో పలువురు నేతలు

అభివాదం చేస్తున్న ప్రజా సంఘాలు, పలు పార్టీల నేతలు

ప్రజాశక్తి-నక్కపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెటిరో పైపులైన్‌కు అనుమతి ఇవ్వొద్దని పలువురు నేతలు తెలిపారు. హెటిరో పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకార జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహా ధర్నా గురువారం నాటికి 365 రోజులకు చేరుకోవడంతో శిభిరం వద్ద సింహగర్జన పేరిట భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసారు. మత్స్యకార జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరియ్య అధ్యక్షతన జరిగిన సభలో పలువురు అఖిలపక్ష పార్టీల నేతలు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జడ్‌పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ మాట్లాడుతూ, పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకార యువత ముందుకు వచ్చి ఉధ్యమాన్ని ముందుకు తీసుకువెళ్లడం అభినందనీయమన్నారు. సరైన నిర్ణయం తీసుకుని భవిష్యత్తులో కూడా పైప్‌లైన్ ఏర్పాటుకు అనుమతులు రాకుండా పోరాటాన్ని కొనసాగించాలన్నారు. తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత మాట్లాడుతూ, కంపెనీ కాలుష్యం కారణంగా అనేకమంది మత్స్యకారులు అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. పాత పైప్ లైన్ దెబ్బతినడంతో కొత్త పైపులైన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, పాతది పాడైతే ఉత్పత్తి ఎందుకు నిలుపుదల చేయలేదని ప్రశ్నించారు. కొత్త పైప్ లైన్ అనుమతి కోసం కంపెనీ యాజమాన్యం ఢిల్లీ చుట్టూ తిరుగుతుందన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, ఎటువంటి అనుమతులు లేకుండా పైపులైన్ ఏర్పాటు చేయడానికి కంపెనీ యాజమాన్యానికి అంత ధైర్యం ఎవరిచ్చారని ప్రశ్నించారు. హెటిరో కాలుష్య వర్థ జలాలను సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించి మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదన్న ఉద్దేశ్యంతో న్యాయ పోరాటం చేస్తున్నామని, చెన్నైలో జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసు వేయడంతో వారు వివిధ విభాగాల్లో ముఖ్యమైన అధికారులతో అత్యున్నత కమిటిని నియమించారన్నారు. హెటిరో కంపెనీకి 6 కోట్ల 94లక్షలు ఫైన్ కూడా విధించడం జరిగిందన్నారు.

జాతీయ మత్సకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు మాట్లాడుతూ, ప్రభుత్వాలు తీర ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే ముందు తప్పనిసరిగా ఆయా గ్రామాల మత్స్యకారుల ఆమోదం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జాయింట్ యాక్షన్ కమిటి ద్వారా ఉధ్యమాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. రాజయ్యపేట పంచాయతీ సర్పంచ్ తనయుడు పిక్కి శ్రీనివాసరరావు మాట్లాడుతూ, కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు పంచాయతీ నుంచి ఎటువంటి తీర్మానం ఇవ్వలేదన్నారు. జనసేన నేత బోడపాటి శివదత్ మాట్లాడుతూ, మత్స్యకారులు తలపెట్టిన ఆందోళనకు తమ పూర్తి మద్దుత్తు ఉంటుందన్నారు. మత్స్యకారులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. మత్స్యకార నాయకులు గరికిన సింహాద్రి, ఉమ్మిడి గోవింద్, పిక్కి స్వామి, వాసిపిల్లి నూకరాజు తదితర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పిక్కి కోదండ, గంగరాజు, గోసల స్వామి పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఓ

రూ.60 లక్షల పరిహారం చెల్లించాలి

అధికారులకు తేల్చి చెప్పిన రైతులు

ప్రజాశక్తి-నక్కపల్లి: రోడ్డు నిర్మాణానికి సేకరిస్తున్న భూములకు సంబంధించి ఎకరానికి రూ.60 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని రైతులు కోరారు. కాగిత జాతీయ రహదారి నుండి ఎస్ఈజెడ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి రైతుల నుండి సేకరిస్తున్న భూములకు పరిహారం చెల్లింపుపై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డిఓ జయరాం, ఎస్‌డిసి అనిత పాటిమీద, మూలపర్ర రైతులతో సమావేశమై చర్చించారు. ఎకరానికి రూ.33 లక్షలు చొప్పున పరిహారం చెల్లిస్తామని ఆర్డిఓ రైతులకు తెలియజేయగా రైతులు నిరాకరించారు. కాగిత రైతులకు చెల్లించిన విధంగా రూ.60 లక్షల చొప్పున చెల్లించాలని రైతులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. అది సాధ్యం కాదని మరో మారు రైతులందరూ చర్చించుకుని వస్తే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అనంతరం న్యాయంపూడి రైతులతో చర్చించారు. ఎకరానికి రూ.4 కోట్ల చొప్పున చెల్లించాలని రైతుల కోరగా, కోటి 20 లక్షల చొప్పున పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. న్యాయంపూడి గ్రామానికి చెందిన రైతులు కూడా నిరాకరించారు. రైతులందరూ మరోసారి ఆలోచించి నిర్ణయం చెబితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆర్డిఓ అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యంశాస్త్రి, న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాలబాబు, అమలాపురం పంచాయతీ సర్పంచ్ పెదపూడి శంకర్రావు, ఉపసర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- చీడికాడ: రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీలకు తురువోలు, చుక్కపల్లి గ్రామాలకు చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగిన త్రోబాల్ పోటీలలో ఎ.బాలాజీ, జి.ఈశ్వరరావులు, మజ్జి పవన్ కుమార్. యమున విద్యార్థులు విజేతలుగా నిలిచి ఎంపికయ్యారు. రాష్ట్ర పోటీలకు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, బి.కోటేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఎం.చిన్నమ్మలు, ఎం.వరహాల రావు అభినందించారు.

వికలాంగులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని వీర నారాయణం ప్రభుత్వ పాఠశాలలో వికలాంగ విద్యార్థులకు గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. .గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ప్రత్యేక ఉపాధ్యాయులు నల మహారాజు, సత్యారావు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందిస్తున్న హెచ్ఎం

ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు సిపిఎం లేఖ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ నమోదులో జరిగిన అక్రమాలు, అనర్హుల నమోదుపై వెరిఫికేషన్ చేసి తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అమరావతిలోని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్‌మీనాకు లేఖ రాశారు. లేఖలో పేర్కొన్న వివరాలిలావున్నాయి....

మొదట దశలో నమోదైన ఒటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించిందని, అందులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని తెలిపారు. అనర్హులను వైసిపి నమోదు చేయిందని వివరించారు. ఈ ఓటర్ల నమోదులో జరిగిన అక్రమాలపై విచారణకు, వెరిఫికేషన్‌కు ప్రత్యేక ఐఎఎస్ అధికారిని నియమించి విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం జిల్లాలో ఓటర్ నమోదు చివరి రోజైన నవంబర్ 7వ తేదీ ఒక్కరోజులోనే 87 వేల ఓట్లు నమోదు అయ్యాయని తెలిపారు. వీటిపై ప్రత్యేక విచారణ జరిపించాలని కోరారు. మొత్తం 2 లక్షల 43 వేలా 903 ఓటర్లు అర్హులుగా ప్రకటించారని పేర్కొన్నారు. అర్హులై వేల సంఖ్యలో ఉన్న ఓటర్లను నమోదు చేయలేదని తెలిపారు. అన్ని అర్హతలు ఉండి గెజిటెడ్ సంతకంతో ఆఫ్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిని, ఎటువంటి పరిశీలన చేయకుండానే తొలగించారని వివరించారు. డిజిగ్నేటెడ్ ఆఫీసర్ దరఖాస్తు పరిశీలించి ఎకనాలెడ్జిమెంట్ ఇచ్చినా నమోదు చేయలేదని పేర్కొన్నారు. విశాఖ జిల్లాలో సుమారు 4 వేలమంది అర్హత ఉన్న పట్టభద్రుల దరఖాస్తులను దురుద్దేశంతోనే నమోదు చేయలేదని తెలిపారు. వెంటనే వాటిని ఎన్‌రోల్ చేసేలా ఆదేశించాలని కోరారు.

డిగ్రీ అర్హత లేని వారి పేర్లు వేల సంఖ్యలో డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి, ఐటిఐ, పాలిటెక్నిక్ సర్టిఫికెట్స్ కలిగిన వారిని ఓటర్లగా చేర్పించారని పేర్కొన్నారు. 2019 అక్టోబర్ 30 తర్వాత, 2020, 2021, 2022 సంవత్సరాలలో డిగ్రీ పాసైన వారిని కూడా ఓటర్ గా నమోదు చేశారని వివరించారు. ఒక వ్యక్తి రెండు నుంచి ఐదు సార్లు ఒటర్ జాబితాలో నమోదయ్యారని, ప్రతి బూత్‌లో ఇటువంటివి 50 నుంచి 80 వరకు ఉన్నాయని తెలిపారు. తిరస్కరించిన ఓటర్ జాబితాను వెంటనే ప్రకటించాలని, దీనివల్ల అభ్యంతరాలు చెప్పటానికి, తిరిగి నమోదు చేసుకోవడానికి సులభం అవుతుందని పేర్కొన్నారు.

ఓటర్ అప్లికేషన్లు డిగ్రీ సర్టిఫికెట్లతో పాటు, ఏ సంవత్సరంలో పాసయ్యారో వివరాలను ఎన్నికల కమిషన్ వెబ్ సైట్‌లో పెట్టాలని కోరారు. ఆన్‌లైన్‌లో నమోదైన ఎక్కువ దరఖాస్తులను వైసిపి నాయకుల ఒత్తిడితో బిఎల్‌ఒలు వెరిఫికేషన్ చేయలేదని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజకీయాలకతీతంగా పథకాలు

గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గణేష్, బాబూరావు

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ: సీఎం వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ తెలిపారు. గురువారం గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలికి గాయమైనప్పటికీ వీల్‌చైర్‌లోనే ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకున్నారు. పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఈ మూడున్నరేళ్ల కాలంలో 99 శాతం నెర వేర్చామన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో నాడు నేడు పథకంలో రూ.18లక్షలతో చేపట్టిన పాఠశాలను అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ సుర్ల గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, మండల మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, మండల వైస్ ఎంపిపిలు సుర్ల ఆదినారాయణ, జక్కు నాగమణి, సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి, మండల యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, ఉప సర్పంచ్ ఎం.వరహాలబాబు, పిఏసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొందల రాజు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: రాష్ట్రంలో జనరంజక పాలనను సిఎం జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారని పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబురావు కొనియాడారు. పెద ఉప్పలం పంచాయితీలో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు సచివాలయం, జల జీవన్ మిషన్ ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతీ ఒక్కరికి పింఛన్‌లు, పక్కా ఇళ్ళు మంజూరు చేశామన్నారు. రైతు భరోసా, అమ్మఒడి వంటి పథకాలు ప్రవేశపెట్టి ప్రభుత్వం ఆదుకుం టుందన్నారు. సంక్షేమ పథకాల అమలు పై స్థానిక ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటరమణ, నాగేశ్వరావు, పెద ఈశ్వరరావు, నూకి నాయుడు, గురునాధరావు, శ్రీను, ప్రసాద్, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.